RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 298 పేజీలు - 08 మంగళవారం 22 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## తెలంగాణ మలిదశ ఉద్యమంలో
# కీలక పాత్ర

- లింగాల కేదారి, పుష్పలత సేవలు మరువలేనివి
- వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన లింగాల కేదారి, ఆయన భార్య పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. హనుమకొండలోని శాంతినగర్, పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మరణించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నుంచి సీఎం ఓఎస్డీ రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. **మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షల సాయం**తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ మిగతా2లో...



## పార్టీ శ్రేణుల అణచి వేతకు
# రాష్ట్ర సర్కారు కుట్ర

- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం
- మేం తప్పులు చేస్తే చర్యలు తీసుకోవచ్చు
- సిరిసిల్లలో 8 వేల ఎకరాలు? కబ్జా చేసిందెవరు? : బీఆర్ఎస్ నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన
- జూరాలలో నీళ్లున్నా ఎందుకు విడుదల చేయటం లేదు?
- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం : నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:**జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద జలాలపై కట్టిన ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నీరు తీసుకెళ్తుంటే ఇక్కడ నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద కూడా నీరు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ఏడాది వచ్చిన 248 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ మిగతా2లో...

## 'దానం' పిటిషన్ విచారణకు అనుమతి

- రేపు సుప్రీంకోర్డులో విచారణ



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:** దానం నాగేందర్ పిటిషన్ విచారణకు అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. తెలంగాణ హైకోర్టు అనర్హత ఆదేశాల నేపథ్యంలో ఉప ఎన్నిక నోటిఫికేషన్‌పై ఆందోళనగా ఉందని దానం నాగేందర్ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి సుప్రీంకోర్టుకు నివేదించారు. అందువల్ల ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. పార్టీ ఫిరాయించారన్న కారణంతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పును ఈనెల 19న దానం నాగేందర్ సుప్రీంకోర్టులో మిగతా2లో...

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు
# హైకోర్టు నోటీసులు

- స్పీకర్‌ను దూషించారన్న ఆరోపణల కేసులో..



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను దూషించారన్న ఆరోపణలతో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ కుమార్‌రెడ్డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఈనెల ఎనిమిదిన కింది కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఏపీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మధుసూదన్ రావు సోమవారం విచారించారు. పీపీ వాదిస్తూ స్పీకర్ కులం తెలిసేలా కావాలనే అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలను రిమాండ్‌కు పంపేందుకు మెజిస్ట్రేట్ నిరాకరించడం చట్ట వ్యతిరేకమన్నారు. పలువురు సాక్షుల వాంగ్మూలాలతోపాటు మిగతా2లో...

## కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు : జూపల్లి కృష్ణారావు



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:**
గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మిగతా2లో...

## ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:** ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో మంత్రి సీతక్క ఈరోజు (సోమవారం) ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనుల ప్రణాళికపై సమీక్షించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో తీవ్రత అందరికీ తెలుసునని.. ఈ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.**రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నాం..** అక్టోబర్ 2వ తేదీన మిగతా2లో...



## జూరాల వద్ద హైటెన్షన్

- సాగునీటి కోసం రైతుల ఆందోళన
- ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం యత్నం, అరెస్ట్
- ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
- డ్యాం చుట్టూ పోలీస్ పహారా
- గులాబీ నేతలు వర్సెస్ పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట
- రైతుల నిరసనకు మద్దతుగా బీఆర్ఎస్ ధర్నా, హౌస్ అరెస్టులు

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. జూరాల డ్యాం ముట్టడికి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. రైతుల ఆందోళనకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు

మిగతా2లో...

## సోనియా గాంధీకి
# ఢిల్లీ కోర్టు షాక్

- పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు
- పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే ఎన్నికల జాబితాలో సోనియా పేరు ఉందని ఆరోపణలు
- గతంలో దీనిపై దర్యాప్తును తిరస్కరించిన మేజిస్ట్రియల్ కోర్టు
- తాజాగా దాన్ని కొట్టివేస్తూ ఆదేశాలు



2లో

# పార్టీ శ్రేణుల అణచి వేతకు రాష్ట్ర సర్కారు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

కేవలం 28 టీఎంసీలు మాత్రమే వాడిందని వివరించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు మొదటి శత్రువులా తయారయ్యారని అన్నారు. ఎల్‌నినో తరహాలో ఎల్ కాంగో వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. రైతుల కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలను దుర్మార్గంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో భయటపెట్టలేరని అన్నారు. జూరాల కింద ఒక్క ఎకరం పంట ఎండినా కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుడతామనీ, ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాలు కాకుండా రైతుల ప్రయోజనాలు ముఖ్యం కావాలని సూచించారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని కోరారు. కన్నేపల్లి, నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి పది టీఎంసీల నీరు తీసుకొచ్చి పంటలను కాపాడాలని చెప్పారు. తాము ఏమైనా తప్పులు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు అయినా తీసుకోవచ్చని అన్నారు. డ్రామాలు తగవనీ, భూముల వద్దకు వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని సవాల్ చేస్తే ఇప్పటి వరకు కనీసం స్పందన లేదని అన్నారు. సిరిసిల్ల వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చెప్తారని ప్రశ్నించారు. నేతన్నల ఆత్మహత్యలు, రైతుబంధు ఎగ్గొట్టింది వివరిస్తారా? అని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో చేసిన అభివృద్ధిని చూసి కొడంగల్‌లో అమలు చేసేందుకు వస్తున్నారేమోనని అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సిరిసిల్లలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఎవరు కబ్జా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజన్న దర్శనం చేసుకుని పాప ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు.

### పలువురి చేరిక

తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గం జాఫర్ ఘడ్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక బీఆర్ఎస్ నేతలు యాస జితేందర్ రెడ్డి, తాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, యాస సందీప్ రెడ్డి, చిడిమిల్ల మధు రెడ్డి పాల్గొన్నారు.

# 'దానం' పిటిషన్ విచారణకు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

సవాల్ చేశారు. ఈ అనర్హత పిటిషన్‌పై విచారణ జరపాలని దానం నాగేందర్ తరపు ముకుల్ రోహిత్గి సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించగా, తెలంగాణ హైకోర్టు విచారించి అనర్హతా వేటు వేసిందని వివరించారు. ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని అందువల్ల అత్యవసరంగా విచారించాలని కోరారు. 'రేపటి విచారణ జాబితాలో అత్యవసరంగా విచారించాలని కోరుతున్నాను. గత శుక్రవారం తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఇదే విషయంలో దానం నాగేందర్ పై పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌ను స్పీకర్ తిరస్కరించారు. దానం నాగేందర్ తన పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు. కానీ.. పార్టీతో సంబంధం లేని వ్యక్తి (బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్) ఈ పిటిషన్ ను వేశారు' అని ధర్మాసనానికి నివేదించారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లోని అనర్హతకు సంబంధించినదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం, స్పీకర్ ఖైరతాబాద్ ఖాళీ అని నోటిఫై చేస్తే ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసే ఆస్కారం ఉందన్నారు. అందువల్ల పిటిషన్‌ను నేడు (మంగళవారం) విచారణ చేపట్టాలని కోరారు. ప్రతివాదుల తరపు న్యాయవాదులు కూడా కోర్టు హాల్‌లోనే ఉన్నారని నివేదించారు. దీనిపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలాని స్పందిస్తూ, రేపు (బుధవారం) ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. అన్ని వైపుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని తెలిపింది. అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న తాను 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినందుకు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పేరా 2(1)(ఎ) రెడ్ విత్ ఆర్టికల్ 191(2)కింద తనను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎమ్మెల్యే అనర్హత విషయంలో స్పీకర్ తీసుకొనే నిర్ణయా లను న్యాయ స్థానాలుసమీక్షించడానికి వీలులేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఉద్యోగ సంఘాల చర్చల్లో ప్రతిష్టంభన

**సీఎస్‌తో ఉద్యోగ సంఘాల భేటీ**

**ప్రధాన డిమాండ్లు ప్రస్తావించిన సంఘాలు**

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:** రాష్ట్ర ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాల చర్చలు వాయిదా పడ్డాయి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందుబాటులో లేకపోవడంతో మంగళవారం సాయంత్రం 6 గంటలకు సమావేశమవుదామని ఉద్యోగ సంఘాల నాయకులకు సీఎస్ సంజయ్ జాజు వెల్లడించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లు ఆర్థికపరమైన అంశాలు కావటంతో భట్టి విక్రమార్కతో చర్చించాలని ఇరువురు భావిస్తున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎస్ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రధానంగా నాలుగు డిమాండ్లపై వారు చర్చించారు. సమావేశం ప్రారంభం కాగానే తొలుత నూతన ఉద్యోగ ఆరోగ్య పథకంపై చర్చించారు. దాదాపు ఒక గంటపాటు అదే అంశంపై చర్చించడంతో ఉద్యోగ సంఘాల నేతలు మిగిలిన అంశాలను కూడా చర్చించాలని కోరారు. పీఆర్సీని అమలు చేయాలనీ, పెండింగ్ ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రతి నెల రూ.2,000 కోట్లు కేటాయించడం, అందులో 50 శాతం ఉద్యోగులకు, 50 శాతం పెన్షనర్లకు చెల్లించాలని



నేతలు కోరారు. అదే విధంగా సీపీఎస్ రద్దు, 2003 డీయస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్లను ముందుకు తెచ్చారు. దీనిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లి మరోసారి రాత్రి 7.30 గంటలకు చర్చిద్దామని సీఎస్ కోరారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలు మరోసారి సమావేశానికి సిద్ధమవగా, డిప్యూటీ సీఎం అందుబాటులో లేని కారణంగా చర్చలను నేటి సాయంత్రం 6 గంటలకు వాయిదా వేసినట్టు సీఎస్ సమాచారాన్ని అందజేశారు. సీఎస్ సమావేశం సందర్భంగా సీపీఎస్ రద్దు విషయంలో ఎనిమిది అధికారులతో కమిటీ వేయనున్నట్టు సూత్రప్రాయంగా వెల్లడించినట్టు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. నెలాఖరు లోగా పీఆర్సీ రిపోర్ట్ ను తెప్పించుకుంటానని సీఎస్ వెల్లడించారని తెలిపారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవోస్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, పీఆర్టీయూ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, టీఎన్జీవో, టీజీవో ప్రధాన కార్యదర్శులు ముజీబ్, బి.శ్యాం, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, జేఏసీ నాయకులు మధుసూదన్ రెడ్డి, కృష్ణమూర్తి, కస్తూరి వెంకటేశ్వర్లు, సోమయ్య, పి.వెంకటరెడ్డి, అబ్దుల్లా, కటకం రమేశ్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

# బీమా రంగంలోనూ యూపీఐ

**- పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీకి ఐఆర్‌డీఏఐ కసరత్తు**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ సెప్టెంబర్ 21:** భారత బీమా రంగంలో సమూల మార్పులు తెచ్చేందుకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ప్రయత్నాలు ముమ్మరం చేసింది. డిజిటల్ పేమెంట్స్ రంగంలో యుపిఐ సంచలనం సృష్టించినట్లే.. బీమా రంగంలోనూ పారదర్శకతను పెంచేందుకు ప్రతిపాదిత పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీ (పీఐఆర్) తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ ఇటీవల ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. పాలసీదారులకు అన్ని బీమా వివరాలు ఒకే చోట లభించడం, సులభంగా కేవైసీ పూర్తి చేయడం, క్లెయిమ్ చరిత్ర అందుబాటులోకి రావడం వంటి ప్రయోజనాలు ఈ వ్యవస్థ ద్వారా చేకూరుతాయి. జీ-20 డీపీఐ మార్గదర్శకాల ఆధారంగా రూపొందిస్తున్న ఈ ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్ విధానం వల్ల డేటా భద్రతకు




ఎటువంటి భంగం కలగకుండా పాలసీదారులకు, బీమా సంస్థలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ వ్యవస్థ ద్వారా సమాచారమంతా ఒకే చోట కేంద్రీకృతం కాకుండా డేటా ఎక్కడ సేకరించబడిందో అక్కడే సురక్షితంగా ఉండేలా ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్‌ను అవలంబిస్తున్నారు. దీని ద్వారా పాలసీదారులకు జీవిత, ఆరోగ్య, మోటార్, ఆస్తి బీమాలకు సంబంధించిన అన్ని పాలసీల వివరాలు ఒకే చోట కనిపిస్తాయి. నామినీలు, రెన్యూవల్స్, క్లెయిమ్‌లు సులభంగా పర్యవేక్షించవచ్చు. పాలసీల మార్పిడి (పోర్టబిలిటీ) మరింత సులభమవుతుంది. బీమా కంపెనీలకు పాలసీలు, క్లెయిమ్ చరిత్ర పారదర్శకంగా లభించడం వల్ల అండర్‌రైటింగ్ ఖచ్చితత్వం పెరుగుతుంది. మోసాలను అరికట్టడానికి వీలవుతుందని ఐఆర్‌డిఎఐ వర్గాలు భావిస్తున్నాయి. బ్యాంకులు, ప్రభుత్వాలకు కూడా వెరిఫైడ్ కవరేజ్ డేటా అందుబాటులోకి రావడం వల్ల రుణాల మంజూరు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభమవుతుంది. ప్రస్తుతం బీమా రంగంలో పాలసీదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకే వ్యక్తి వివిధ బీమా సంస్థల నుంచి పాలసీలు తీసుకున్నప్పటికీ ప్రతిసారీ కేవైసీ ప్రక్రియను విడివిడిగా పూర్తి చేయాల్సి వస్తోంది. అలాగే, క్లెయిమ్ చరిత్ర అందుబాటులో లేకపోవడం వల్ల అండర్‌రైటింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. అంతేకాకుండా వినియోగదారులు తమకు నచ్చిన బీమా పాలసీని సులభంగా పోల్చుకునే అవకాశం లేక, ఏజెంట్లు చెప్పే మాటల మీదే ఆధారపడాల్సి వస్తోంది. ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరోను పూర్తిగా ఐఆర్‌డీఏఐ యాజమాన్యంలోని లాభాపేక్ష లేని సంస్థగా పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదించారు.

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 21:** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేండ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్ను తిరిగి విచారణ చేపట్టాలంటూ ఢిల్లీ కోర్టు సోమ వారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివే శారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్ను దాఖలు చేశారు. "భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 175(3)ను పాటిం చకపోవడం, ముఖ్యంగా సంబంధిత పోలీస్ అధికారి వాదనలు వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్ట్ తెప్పిం చకపోవడం వంటి కారణాల వల్ల సదరు ఉత్తర్వు లో చట్టపరంగా స్పష్టమైన లోపం ఉంది. చట్టం ప్రకారం ఉన్న రెండు మార్గాలను అంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా ప్రత్యా మ్నాయంగా బీఎన్ఎస్ఎస్ కింద విచారణ జరపడం వంటి అంశాలను మేజిస్ట్రేట్ పరిగణ నలోకి తీసుకోనందున ఆ ఉత్తర్వులో ఎటువంటి వివరణా లేదని స్పష్టమవుతోంది." అని న్యాయమూర్తి అన్నారు.

# తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 2013 జూన్ 20న ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమయ్యారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విజ్ఞప్తి మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని, ఈ క్రమంలో ఆయన అరెస్టై చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించబడ్డారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యారని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల కోటా కింద మానవతా దృక్పథంతో ఆయన తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మి రెడ్డికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

వీడియో ఫుటేజీలను సేకరించి కోర్టుకు సమర్పించినప్పటికీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ప్రత్యేక కోర్టు పరిధిలో ఉన్నందున మెజిస్ట్రేట్ రిమాండ్‌ను తిరస్కరించలేరని చెప్పారు. ఆ ఉత్తర్వులను రద్దు చేసి ఎమ్మెల్సీల రిమాండ్‌కు ఆదేశించాలన్నారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది.

# జూరాల వద్ద హైటెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు చుట్టూ 12 కిలోమీటర్ల పరిధిలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాసు హనుమంతునాయుడు తదితరులను పోలీసులు తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి కోసం రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జూరాల ఆయకట్టులో పొలాలు ఎండిపోవడంతో శనివారం రైతులే స్వయంగా ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో అధికారులు అర్ధరాత్రి తిరిగి గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో జూరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జూరాల ప్రాజెక్టు ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జూరాలకు బయలుదేరారు. నందిమల్ల వద్ద పోలీసులు ఆయనను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని నిరసన తెలిపేందుకు రైతులతో కలిసి వెళ్లడం నేరమా అంటూ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల్ని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది.

# ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)

గ్రామసభలు నిర్వహించి యాక్షన్ ప్లాన్‌పై తీర్మానాలను ప్రవేశపెట్టాలని మంత్రి సీతక్క మార్గనిర్దేశం చేశారు. ఆయా గ్రామాల వారీగా అవసరాలు, నిధుల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యం క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది పంచాయతీలకు వచ్చే అన్ని నిధులపై గ్రామసభల్లో చర్చించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద రూ.6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో సగటున రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పనులు అడిగిన వారందరికీ కల్పించాలని సూచించారు. **ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలి..** ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి అధికారులకు జిల్లాల వారీగా మానిటరింగ్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు జిల్లాల్లో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ఈ సమావేశాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో పర్యటించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు : జూపల్లి కృష్ణారావు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు.

# సహస్ర దీపారాధనతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న చౌటుప్పల్ కాంప్లెక్స్

**చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, భక్తులు**





**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 21:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చౌటుప్పల్ కాంప్లెక్స్‌లో ద్వాదశ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సహస్ర దీపారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి వెయ్యి దీపాలతో దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో దీపారాధనకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని, దీపం జ్ఞానం, పవిత్రత, శుభానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. చీకటిని తొలగించి వెలుగును ప్రసరింపజేసే దీపం మాదిరిగానే మన జీవితాల్లోని అజ్ఞానం, అశుభాలను తొలగించి జ్ఞానం, సానుకూలత, శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ సహస్ర దీపారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెయ్యి దీపాలను గణపతి స్వామికి సమర్పిస్తూ ప్రజల సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సమాజ శ్రేయస్సు కోసం భక్తులు ప్రార్థనలు చేశారని తెలిపారు. వెయ్యి దీపాల వెలుగులతో చౌటుప్పల్ కాంప్లెక్స్ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయని వారు కొనియాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించి సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ వ్యాపారస్తులు గోశిక కరుణాకర్, బద్దం లింగారెడ్డి, గోశిక పాండు, మసారం యాదగిరి, లోక విష్ణు, గోలి యాదగిరి, ములుగు లక్ష్మయ్య, దొంత మల్లేశం, కర్నాటి శ్యామ్, మాజీ ఎంపీటీసీ గోశిక సుమతి, శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలే మనకు స్ఫూర్తి

**● త్యాగశీలి బాపూజీకి ఘన నివాళి ● చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ ● వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్**




**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 21:** తెలంగాణ ఉద్యమ యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి, డిప్యూటీ స్పీకర్ స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సభాధ్యక్షులు బడుగు లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన త్యాగం, సేవా స్ఫూర్తి, తెలంగాణ సాధన కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. బాపూజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే బాపూజీకి అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు బడుగు మోహన్ బాబు, మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లల జ్యోతి, రమేష్, హస్తం గంగరాములు, చేనేత నాయకులు గుర్రం వెంకటేశం, తాటబత్తిని భీమయ్య, గోశిక శ్రీకాంత్, బడుగు జయప్రకాష్, కర్నాటి శ్యామ్, గోశిక పాండు, గుర్రం రవీందర్, వేముల నరసింహ, రాపోలు శ్రీరాములు, గోశిక ప్రభాకర్, బడుగు బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే చేనేత సహకార సంఘం డైరెక్టర్లు పాపని రామకృష్ణ, గోశిక ధనుంజయ, కందగట్ల మధుసూదన్, పాపని వాసుదేవ్, కర్నాటి జనార్ధన్, దోర్నాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని బాపూజీకి ఘన నివాళులు అర్పించారు.

# న్యాలపల్లి చేనేత సంఘం అధ్యక్ష ఎన్నికకు వెంటనే చర్యలు చేపట్టాలి

**ట్రిబ్యునల్ తుది తీర్పుతో అధ్యక్ష పదవి ఖాళీ.**

**సంఘాన్ని నిర్వీర్యం చేయకుండా నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాలి: నూతన డైరెక్టర్ల డిమాండ్**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 21:** చౌటుప్పల్ మండలం న్యాలపల్లి చేనేత సహకార సంఘంలో ఏర్పడిన అధ్యక్ష పదవి ఖాళీ సమస్యను తక్షణమే పరిష్కరించి, చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాలని సంఘం నూతన డైరెక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఎన్నికల అథారిటీ అదనపు రిజిస్ట్రార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నూతన డైరెక్టర్లు తడక పారిజాత మోహన్, పిల్లలమర్రి కిరణ్, గంజి శ్రీనివాస్, తడక కోటేశ్వర్ మాట్లాడుతూ.. 10-07-2026న జరిగిన సంఘం ఎన్నికల్లో తాము డైరెక్టర్లుగా ఎన్నికయ్యామని, అనంతరం పిల్లలమట్టి శ్రీనివాసులు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. అయితే అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి అర్హతపై అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో, సంబంధిత ఆధారాలతో 05-08-2026న తెలంగాణ కోఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం 15-09-2026న ఐఏ నం.129/2026, ఓపీ నం.31/2026లో ట్రిబ్యునల్ తుది తీర్పు వెలువరించిందని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ తుది ఆదేశాల నేపథ్యంలో అధ్యక్షుడిగా ఎన్నికైన పిల్లలమట్టి శ్రీనివాసులు పదవిని కోల్పోయినందున, ప్రస్తుతం సంఘానికి అధ్యక్ష పదవి ఖాళీగా ఉందని నూతన డైరెక్టర్లు తెలిపారు. "ఎన్నికలు జరిగి నెలలు గడుస్తున్నా సంఘం పూర్తిస్థాయిలో పనిచేయక పోవడం చేనేత కార్మికుల ప్రయోజనాలకు నష్టం కలిగించే పరిస్థితి. అధ్యక్ష పదవి ఖాళీగా ఉన్న పేరుతో సంఘం కార్యకలాపాలను నిలిపి వేయడం ఎంతమాత్రం సమంజసం కాదు. చేనేత కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహాయం, ఇతర కార్యక్రమాలు ఎక్కడా ఆగిపోకూడదు" అని వారు అన్నారు. ట్రిబ్యునల్ తీర్పు వెలువడిన నేపథ్యంలో ఇకనైనా అధికారులు జాప్యం చేయకుండా సహకార సంఘాల చట్టం, ఎన్నికల నిబంధనల ప్రకారం అధ్యక్ష పదవిని భర్తీ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధ్యక్ష పదవిని ఖాళీగా ఉంచి సంఘాన్ని నిర్వీర్యం చేసే పరిస్థితి కొనసాగితే చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల హక్కులు, సంఘం భవిష్యత్తు కోసం అవసరమైతే చట్టబద్ధమైన ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నూతన డైరెక్టర్లు స్పష్టం చేశారు. సంఘం సజావుగా పనిచేసేలా, చేనేత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అందేలా, ఖాళీ అయిన అధ్యక్ష పదవికి వెంటనే ఎన్నిక నిర్వహించి ప్రజాస్వామ్యబద్ధంగా నూతన అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించాలని వారు తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఎన్నికల అథారిటీని కోరారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఎస్పీ ప్రత్యేక పరిశీలన

**● బొమ్మల కుంట చెరువు వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన**

**● అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 21:** చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామం లో వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పరిశీలించారు. చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలోని వినాయక నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన బొమ్మల చెరువును ఎస్పీ అక్షాంశ్ యాదవ్, చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, నిమజ్జన ప్రదేశానికి వెళ్లే మార్గాలు, అవసరమైన మరమ్మతు పనులు, విద్యుత్ సదుపాయాలు, వైద్య సేవలు, ఇతర మౌలిక వసతులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్, మున్సిపల్ కమిషనర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ జయరాజుకు ఉత్తమ సేవా పురస్కారం - 2026

**- 38 సార్లు O నెగటివ్ రక్తదానం చేసిన వరంగల్ పోలీస్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు మానవతా సేవలో చేస్తున్న కృషికి గాను ప్రతిష్టాత్మక ఉత్తమ సేవా పురస్కారం - 2026కు ఎంపికయ్యారు. జయరాజు ఇప్పటి వరకు అత్యంత అరుదైన O నెగటివ్‌రక్తాన్ని 38 సార్లు స్వచ్ఛందంగా దానం చేసి అనేక మంది ప్రాణాలను కాపాడారు. ఎా నెగటివ్ రక్తం అత్యవసర సమయంలో అందరికీ ఎక్కించగలిగే యూనివర్సల్ రక్తం కావడం విశేషం. అంతేకాకుండా, తాను రక్తదానం చేయడమే కాకుండా పలు రక్తదాన శిబిరాలను స్వయంగా నిర్వహించి, వందలాది మంది యువతతో, స్నేహితులతో రక్తదానం చేయించడం ద్వారా రక్తదాన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఆయన చేస్తున్న ఈ నిరంతర సేవలను గుర్తించి భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వారు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. రక్తదానం ప్రాణదానం, సేవే పరమో ధర్మం అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్&తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల రక్తదాతలు, సామాజిక సేవకులను సన్మానించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో...38 సార్లు ఎా నెగిటివ్ బ్లడ్ డొనేట్ చేసినందుకు, ఇతరుల చేత చేయించినందుకు గాను బెస్ట్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు-2026 ను డా.సంపత్ కుమార్-వరల్డ్ గిన్నిస్ రికార్డ్ హోల్డర్, ప్రముఖ ఫుడ్ డోనర్ గౌతమ్ చేతుల మీదుగా స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ మాట్లాడుతూ, ఈ అవకాశం కల్పించిన అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.కురుమేటి నవీన్ కు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# మిత్రుడు దూరమైనా.. స్నేహం దూరం కాలేదు!

**బర్కం అంజి కుటుంబానికి ఎస్ఎస్‌సీ 2002-2003 బ్యాచ్ ₹70,100 ఆర్థిక సహాయం**




**తొలి అక్షరం / చౌటుప్పల్ / సెప్టెంబర్ 21:** చౌటుప్పల్ మండలం పంతంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20022003లో కలిసి చదువుకున్న మిత్రుడు బర్కం అంజి అకాల మరణం చెందడంతో పూర్వ విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో అందరూ కలిసి ₹70,100 సమకూర్చి, సోమవారం చెక్కు రూపంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. అంజి తమ మధ్య భౌతికంగా లేకపోయినా ఆయనతో ఉన్న స్నేహం, జ్ఞాపకాలు ఎప్పటికీ తమతోనే ఉంటాయని మిత్రులు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆయన కుటుంబానికి అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనగంటి వెంకటేశం, కాకి సుందర్, నందగిరి లింగస్వామి, మాటూరు రవి, బొడిగె మహేష్, అవిశెట్టి అశోక్, పబ్బు లింగస్వామి, చుక్క రమేష్, లగ్గొని లింగస్వామి, బర్రె శీను, పబ్బు శ్రీను, రోడ్డ భగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మాముసూరు విమానాశ్రయానికి పి.వి.నరసింహారావు పేరు పెట్టాల్సిందే!


**- కందుకూరి రజినీకాంత్ అడ్వకేట్**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ గడ్డపై జన్మించి, భారత ప్రధానమంత్రిగా ఎదిగి, దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సంస్కరణలకు నాయకత్వం వహించిన మహనీయుడు పి.వి. నరసింహారావు. ఆయన సేవలు ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితం కాకుండా యావత్ భారతదేశ ప్రగతికి ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి మహనీయుడి స్వస్థలమైన వరంగల్‌లో ఏర్పాటు కానున్న మామునూరు విమానాశ్రయానికి పి.వి. నరసింహారావు పేరు పెట్టడం సముచితమైన గౌరవం ఇది అభ్యర్థన మాత్రమే కాదు, వరంగల్ ప్రజల న్యాయమైన డిమాండ్! కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. మామునూరు విమానాశ్రయానికి "పి.వి.నరసింహా రావు విమానాశ్రయం"గా పేరు పెట్టే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. వరంగల్ ప్రజాప్రతినిధులు ఈ డిమాండ్‌ను శాసనసభ, పార్లమెంట్‌వేదికలపై బలంగా వినిపించాలి. ప్రజా సంఘాలు, మేధావులు, యువత, అన్ని వర్గాల ప్రజలు ఈ డిమాండ్‌కు తమ మద్దతును తెలియజేయాలి. పి.వి.నరసింహారావు కు వరంగల్ ఇవ్వగల గౌరవం మామునూరు విమానాశ్రయానికి ఆయన పేరు! మన చరిత్రను మనమే గౌరవించాలి. మన మహనీయుడి పేరును మనమే నిలబెట్టాలి. మామునూరు విమానాశ్రయం కు పి.వి.నరసింహారావు పేరు కావాలి!



# పిట్టకల బోడు తండాలో కొత్త పెన్షన్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్.

**- పిట్ట కాల్ బోర్డ్ తండా సర్పంచ్ బాదావత్ సూర్య నాయక్.**



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని ప్రజా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పెన్షన్ల మంజూరు ప్రక్రియలో భాగంగా, పిట్టకాల బోడు తండ గ్రామ పంచాయతీలో కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ బాధవత్ సూర్య భాయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెన్షన్ వెరిఫికేషన్ అధికారులు లబ్ధిదారుల ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ వెరిఫికేషన్ అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు బానోత్ రాధ భూక్య కాంతమ్మ ఉపసర్పంచ్ బాదావత్ రాము, పి ఆర్ ఏ రాజ్ కుమార్, కార్యదర్శి సాంబరాజు మధు తదితరులు పాల్గొన్నారు.

## లక్కారంలో మెగా ఆరోగ్య శిబిరం

**ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన.. యోగా, సహజ వైద్యంపై సూచనలు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 21:** 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ పురపాలక పరిధిలోని లక్కారంలో సోమవారం మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వివిధ ఆరోగ్య సమస్యలపై వైద్య సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. శిబిరంలో యునాని వైద్యాధికారి రోజీ మేరీ, ఫార్మసిస్ట్ సరిత, ప్రకృతి వైద్య నిపుణురాలు అశ్విని, యోగా శిక్షకులు ఝాన్సీ, సాత్విక్ పాల్గొని యోగా, సహజ వైద్యం, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోజీ మేరీ మాట్లాడుతూ వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ముఖ్యమన్నారు. నిత్య జీవితంలో యోగా, ప్రకృతి ఆధారిత ఆరోగ్య పద్ధతులు, సమతుల్య ఆహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు బిక్కు నాయక్, గోపాల్ రెడ్డి, నారాయణరావు, నరసింహారెడ్డితో పాటు స్థానిక ప్రజలు పాల్గొని వైద్యుల సలహాలు, సూచనలు పొందారు. ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు

## వరంగల్ ఎయిర్‌పోర్టు కు దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలి..

**నాయుడు పంపు వద్ద కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి: దయ్యాల శ్రీనివాస్ కురుమ డిమాండ్.**

**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం కేంద్రం నుండి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య కురుమ త్యాగాన్ని గౌరవిస్తూ, వరంగల్ (మామునూరు) ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టాలని, అలాగే వరంగల్ నడిబొడ్డున ఉన్న నాయుడు పంపు వద్ద ఆయన శతజయంతి సందర్భంగా కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ దయ్యాల శ్రీనివాస్ కురుమ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. భూమి కోసం, భుక్తి కోసం, నిరంకుశ నిజాం పాలన, దొరల వెట్టిచాకిరీ విముక్తి కోసం రణభేరి మోగించి తొలి తుపాకీ గుండుకు ఎదురొడ్డి అమరుడైన వీరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఆయన చేసిన ప్రాణత్యాగమే తెలంగాణ విప్లవ పోరాటానికి నాంది




పలికిందని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు గుర్తుచేసేలా ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తక్షణమే స్పందించి: అభివృద్ధి చెందుతున్న వరంగల్ విమానాశ్రయానికి "అమరవీరుడు దొడ్డి కొమరయ్య ఎయిర్‌పోర్ట్"గా నామకరణం చేయాలి. చారిత్రక వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న నాయుడు పంపు సెంటర్ వద్ద దొడ్డి కొమరయ్య శతజయంతి స్మారకార్థం పూర్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆ కూడలికి ఆయన పేరు పెట్టాలి. బహుజనుల, పోరాట యోధుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉందని చెప్పుకునే రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనలను ఆమోదించి అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కురుమ సంఘాలు, ప్రజా, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని దయ్యాల శ్రీనివాస్ కురుమ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కురుమ సంఘం నాయకులు చీర అశోక్ కురుమ వరంగల్ జిల్లా పెళ్లి పందిరి నాయకులు మండల నరసింహ కురుమ మరియు కురుమ కుల సంక్షేమ సంఘం నాయకులు కురుమ సంఘం ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గణనాధుని ఆశీస్సులు అందరిపై ఉండాలి: రామరాజు యాకన్న.



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 21:** గణనాధుని ఆశీస్సులు అందరిపై ఉండాలని రాజకీయ నాయకులు రామరాజు యాకన్న భగవంతుని వేడుకున్నాడు. సోమవారం పురపాలక సంఘ పరిధిలోని 20వ వార్డు మంగలి కాలనీ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజకీయ నాయకులు రామరాజు యాకన్న అన్నప్రసాదం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 వార్డు పరిధిలోని ప్రజలందరినీ గణనాధుడు చల్లగా చూడాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నీ చందు రోహన్ రిషి రాము రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## 70వ, జోనల్ స్థాయి క్రీడలలో సెయింట్ థెరిస్సా హై స్కూల్ ప్రభంజనం

**- సెయింట్ థెరిస్సా హైస్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ చల్లా మమత- యాకూబ్ రెడ్డి**



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మరియు చెన్నారావుపేట మండలాల 70వ,ఎస్ జి ఎఫ్ ఐ జోనల్ స్థాయి క్రీడా ఎంపికలలో భాగంగా చెన్నరావుపేట మండలం మరియు నెక్కొండ పరిధిలోని సూరిపల్లి గ్రామంలో నిర్వహించిన 70వ, జోనల్ స్థాయి క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సెయింట్ థెరిస్సా హై స్కూల్ విద్యార్థులు వాలీబాల్ లో ఎం, ఓంకార్ చంద్రశేఖర్, వెంకట్ లు అదేవిధంగా ఖో ఖో లో బి, ప్రణయ్ కుమార్, బి,రామ్ చరణ్ లు మొదటి స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ తరిస్సా హైస్కూల్ కస్పాండెంట్, ప్రిన్సిపల్ చల్లా మమత – యాకూబ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో నిగూఢమే ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేది పాఠశాల లే క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేటువంటి ప్రతిభను కనబరిచే విధంగా పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రాము సార్ , విద్యార్థిని విద్యార్థులను మరియు ఆటలలో తీర్చిదిద్దడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ఎం, రమేష్ ఎం,దేవేందర్ లావణ్య, యూ, శ్రీకాంత్, కే సుధాకర్, బి సురేష్ లు పాల్గొనడం జరిగింది.

## సెయింట్ థెరీస్సా హైస్కూల్లో పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటిన మనీష్

**- సెయింట్ థెరిస్సా హై స్కూల్ కరెస్పాండెంట్ ప్రిన్సిపల్, చల్లా మమతయాకుబ్ రెడ్డి.**



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని సెయింట్ తెరిస్సా హైస్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న మనీష్ పుట్టినరోజు సందర్భంగా జిన్నా చెట్టు మొక్క నాటడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ చల్లా మమతయాకూబ్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి స్వీట్ తినిపించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, ఎం దేవేందర్ ,రమేష్, శ్రీకాంత్, సుధాకర్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సూరిపల్లిలో జోనల్ స్థాయి క్రీడలు

**- సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదాటి శ్రీనివాస్ గౌడ్.**





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో70వ, జోనల్ స్థాయి (నెక్కొండ చెన్నారావుపేట )కబడ్డీ ఖో ఖో వాలీబాల్ క్రీడల కార్యక్రమం లో పాల్గొన్న సొసైటీ చైర్మన్ మాదటి శ్రీనివాస్ గౌడ్ ఇటీవల సూరిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో నిర్వహించబడిన 70వ, జోనల్ స్థాయి నెక్కొండ చెన్నారావుపేట మండలాల కబడ్డీ,ఖో,ఖో, వాలీబాల్ క్రీడల క్రీడాకారులకు షీల్డ్స్ , టీ షర్ట్స్ ని బహుకరించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనయుడు దొంతి అవియుక్త్ రెడ్డి, సహకారం తో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో పాల్గొని వివిధ గ్రామాల, మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన క్రీడాకారులకు అన్నదానం నిర్వహిశీచిన స్థానిక సహకార సంఘ అధ్యక్షులు మాదటి శ్రీనివాస్ గౌడ్, సోసైటీ డైరెక్టర్స్ కొలిపాక వెంకన్న,సాల్వది స్వామి, గంట జయప్రకాశ్, పిట్టల కొమ్మలు, కోటగిరి సాంబయ్య,గుజ్జునూరి లక్ష్మి, పోగుల ఉపేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్ ఉపాధ్యాయ బృందం ఆదర్శ పాఠశాల కమిటీ ఆర్గనైజింగ్ క్రీడల కార్యదర్శి ఈ సుజాత ఎస్ ఏ పి డి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తకోండ రాజు, గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రజలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా దండెం సంపత్

**• నియామక పత్రాన్ని అందజేసిన జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్**




**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమకారుడు,మాజీ మంత్రి,తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులు వి.శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా దండెం సంపత్ ను నియమించారు. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ దండెం సంపత్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. మాజీ సర్పంచుల సంఘం కార్యదర్శి మెడెం సాగర్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ,గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ ఎఫ్ సి)నిధులను ప్రతి నెల విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తున్న సర్పంచులకు ప్రస్తుతం అందుతున్న గౌరవ వేతనాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఖర్చులు,సర్పంచుల బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని గౌరవ వేతనాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని అన్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దండెం సంపత్ మాట్లాడుతూ,జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సర్పంచుల హక్కులను కాపాడేందుకు తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ తరఫున ముందుండి పనిచేస్తానని,గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులు వి.శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలోవ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ నాయకత్వంలో సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేస్తామని దండెం సంపత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జేఏసీ నాయకులు,మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ తొలి తరం ఉద్యమకారుడు,స్వాతంత్ర్య సమరయోధుడు,ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో ఘనంగా నివాళులర్పించారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన బాపూజీ చిత్రపటానికి టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవినే తృణప్రాయంగా వదిలి,జీవితాంతం తెలంగాణ కోసం పోరాడిన మహనీయుడు బాపూజీ అని,ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేపర్ వినాయకుడిని తయారు చేసిన టీమ్ సభ్యులకు ఘన సన్మానం



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** పర్యావరణహిత పేపర్ వినాయకుడిని అందంగా తయారు చేసిన చందనాల మనోజ్ కుమార్,వారి టీమ్ సభ్యులను హనుమకొండ డిసిసి కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మామిండ్ల సురేష్ మాట్లాడుతూ... మాస్టర్ ఆఫ్ ప్యారిస్(పి ఒ పి)వినాయకుల వల్ల నీటి,వాయు కాలుష్యం పెరిగి పర్యావరణానికి నష్టం కలుగుతున్న నేపథ్యంలో మట్టితో,పేపర్‌తో పర్యావరణహిత వినాయక విగ్రహాలను తయారు చేయడం అభినందనీయమని అన్నారు. 31వ డివిజన్ ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పేపర్,మట్టి వినాయకులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుదాం...పర్యావరణహిత వినాయకుడిని పూజిద్దాంఁడ అని చందనాల మనోజ్ కుమార్,వారి టీమ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## మునిపంపుల గ్రామ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా యాదాసు యాదయ్య



**తొలి అక్షరం/ రామన్నపేట/ మునిపంపుల సెప్టెంబర్ 21:** మునిపంపుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం మండల నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో గ్రామ నూతన అధ్యక్షుడిగా యాదాసు యాదయ్య ను, కార్యదర్శిగా కమ్మంపాటి రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన వారికి మండల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# ఓబీసీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి

**• చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు • సేవలను స్మరించుకున్న ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్,ప్రధాన కార్యదర్శి గడ్డం భాస్కర్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో ఓబీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.బీసీ నేతలు,వివిధ కులసంఘాల ప్రతినిధులతో కలిసి ఓబీసీ చైర్మన్,కుడా మాజీ చైర్మన్ ఎస్.సుందర్ రాజ్ యాదవ్,ఓబీసీ ప్రధాన కార్యదర్శి,ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.బడుగు,బలహీన వర్గాలు,చేనేత కార్మికుల సంక్షేమం కోసం బాపూజీ చేసిన కృషిని ఓబిసి చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ గుర్తుచేశారు.ప్రజా ప్రయోజనాల కోసం పదవులను సైతం త్యాగం చేసిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు,స్వాతంత్ర్య సమరయోధుడని,సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు.ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చూపిన నిబద్ధత,ధైర్యం,త్యాగం,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.మలిదశ ఉద్యమంలో తన నివాసాన్ని తెలంగాణ ఉద్యమం కోసం కేటాయించారన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆయన సేవలను భావితరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామమన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్,బీసీ నాయకులు సంగం వేణుమాధవ్ గౌడ్,గాజుల సంపత్,చక్రపాణి,శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# అభయహస్తంలో కట్టిన డబ్బుల మహిళలకు తిరిగి ఇవ్వాలి



**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 21:** నెల్లికుదురు మండల కేంద్రంలో నిన్న ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన సిపిఎం మండల కార్యదర్శి ఇసం పెళ్లి సైదులు,సిఐటియు మండల అధ్యక్షులు బొల్లం ఎల్లయ్య, ఫిర్యాదు చేయడం జరిగింది. సిఐటియు మండల అధ్యక్షులు బొల్లం ఎల్లయ్య మాట్లాడుతూ గత 15 సంవత్సరాలు క్రితం డ్వాక్రా గ్రూప్ సంఘాల ద్వారా ప్రభుత్వం సంఘ సభ్యుల తో 3800 ప్రతి గ్రూప్ సభ్య రాలి తో స్థానిక వివోఏల ద్వారా ప్రభుత్వం పేద డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ పరంగా ఇన్సూరెన్స్ సౌకర్యం 50 సంవత్సరాలు దాటిన తర్వాత పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి మహిళల దగ్గర డబ్బులు వసూలు చేసింది. ఇప్పటివరకు ఆ డబ్బులు చెల్లించలేదు కొంతమంది డాక్రా మహిళలు చనిపోతే ఇన్సూరెన్స్ సౌకర్యం ఇస్తామని మాయమాటలు చెప్పి డబ్బులు ప్రభుత్వం వసూలు చేసిందని తక్షణమే వసూలు చేసిన 3800 రూపాయలు ప్రభుత్వం వారికి వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. అత్యవసరాల నిమిత్తం శ్రీనిధి అనే పేరుతో పేద ప్రజలకు రుణాలు ఇచ్చి ఉన్నారు అట్టి రుణాలు చెల్లించాలని మహిళలను ఇబ్బందులకు గురి చేస్తూ నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కూలి పనుల మీద ఆధారపడి కుటుంబాలను వెలదీస్తున్న పేద మహిళలు కట్టలేకపోతున్నారు. అగ్రికల్చర్ పనులు దొరకడం లేదు అందుకని కట్టలేక పోతున్నారు. అదేవిధంగా ప్రభుత్వం చిన్నచిన్న రైతులకు రుణాలు ఇస్తుంది అనేక రకాల కారణాల పేరుతో రుణమాఫీ చేస్తుంది భూమి లేని నిరుపేదలకు కూడా సర్వే నిర్వహించి వారు నిజంగా భూమి లేని నిరుపేదలే అయితే కట్టలేని పరిస్థితిలో ఉంటే రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.ప్రభుత్వం ఇప్పటికైనా పేద మహిళలు చెల్లించిన 3800 రూపాయలు తక్షణమే చెల్లించాలని శ్రీనిధిలో తీసుకున్న పేదలను గుర్తించి వాటిని మాఫీ చేయాలని లేనియెడల లబ్ధిదారుల సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో ఘనంగా వినాయక పూజలు



**తొలి అక్షరం/రామన్నపేట/నీర్నెముల సెప్టెంబర్ 21:** రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి.ఈ పూజా కార్యక్రమంలో తొలి అక్షరం రిపోర్టర్ నోముల శంకర్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక అలంకరణ, పూలతో అర్చన చేసి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో చల్ల మల్ల. గోపాల్ పూజారిగా వ్యవహరించి, వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నోముల శంకర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ యూత్ సభ్యులు ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి, గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారని కొనియాడారు. యూత్ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# నిదానపల్లి పైలెట్ గ్రామంగా సమగ్ర భూ రీ-సర్వేకు శ్రీకారం



**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 21:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమం రామన్నపేట మండలంలోని నిదానపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ నారపాక మాధవి యాదయ్య, మాజీ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, ప్రతి ఎకరా భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించి రైతులకు భరోసా కల్పించేందుకే ఈ రీ-సర్వే చేపడుతున్నామని తెలిపారు. రైతులందరూ సహకరించి తమ భూముల పత్రాలతో సర్వేలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఆర్ఐ శోభ, సర్వేయర్ సోనీ, జూనియర్ అసిస్టెంట్ సుగుణాకర్, జీపీఓ లక్ష్మీదేవి, లైసెన్స్ సర్వేయర్ నవీన్ మరియు గ్రామానికి చెందిన రైతులు బొడిగ రంగయ్య, గుత్తా సుధాకర్ రెడ్డి, కడారి ఆంజనేయులు, వర్కల రవి, వర్కాల చంద్రయ్య, నారపాక రమేష్, నారపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ఎస్పీ తనిఖీ - భద్రతా చర్యలపై ఆదేశాలు



**తొలి అక్షరం/రామన్నపేట:** గణేష్ నిమజ్జనం నేపథ్యంలో జిల్లా ఎస్పీ రామన్నపేటను సందర్శించారు.నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి రామన్నపేట సీఐ ఎం రవి, రామన్నపేట ఎస్సై జి సతీష్ పాల్గొన్నారు.గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రామన్నపేట ఎస్సై జి సతీష్ తెలిపారు.

# రామన్నపేటలో ప్రజావాణికి విశేష స్పందన - 23 లో 17 సమస్యలకు పరిష్కారం

**- పెండింగ్‌లో ఉన్న 6 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశం - ఎంపీడీవో ఏ. రాములు**




**తొలి అక్షరం/రామన్నపేట:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి రామన్నపేట మండలంలో విశేష స్పందన లభిస్తోంది.గత నాలుగు ప్రజావాణి కార్యక్రమాలలో మొత్తం 23 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో ఏ. రాములు తెలిపారు. అందులో వివిధ శాఖలకు సంబంధించిన 17 దరఖాస్తుల సమస్యలను ఇప్పటికే పరిష్కరించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.ఇంకా 6 దరఖాస్తులు వివిధ శాఖల్లో పెండింగ్ లో ఉన్నాయని, వాటిని కూడా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో తెలిపారు.ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# శ్రీ ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం - ఆడపడుచులకు కోలల పంపిణీ

**- సామాజిక సేవలో జెట్టి శివప్రసాద్ యాదవ్ ఆదర్శం**




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 21:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈరోజు గ్రామంలోని ఆడపడుచులందరికీ కోలలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి దాతలుగా జెట్టి వరమ్మ, యాదయ్య సహకరించారు. వారికి యూత్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సేవా కార్యక్రమం వెనుక యూత్ సభ్యుడు జెట్టి శివప్రసాద్ యాదవ్‌లికృషి ఎంతగానో ఉంది. గతంలో కూడా పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని గ్రామస్తులు కొనియాడుతున్నారు. పండుగ అంటే కేవలం భక్తి మాత్రమే కాదు, సేవ కూడా అని నిరూపిస్తూ యూత్ చేస్తున్న కృషి అభినందనీయం.ఈ కార్యక్రమంలో శ్రీ ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మద్దెల కార్తీక్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 21:** నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దెల జార్జీ కుమారుడు మద్దెల కార్తీక్ కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ లో ఆక్సిడెంట్ లో చనిపోవడంతో నిన్న మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ కార్తీక్ చిత్ర పటానికి పూలు వేసి నివాళ్లు అర్పించడం జరిగింది.అలాగే వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చడం జరిగింది.మరియు వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని ఎమ్మెల్యే మురళి నాయక్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షులు ఎదల్ల యాదవరెడ్డి, మాజీ అధ్యక్షులు గొల్లపెల్లి ప్రభాకర్ గౌడ్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ బాలాజీ నాయక్, ఉపసర్పంచ్ రామగిరి సుమన్ గ్రామ అధ్యక్షులు బెల్లి నర్సయ్య, దోనికాని మల్లయ్య,కుటుంబ సభ్యులు కార్తీక్ భార్య సుచరిత,మద్దెల భద్రయ్య, మద్దెల డా,,ప్రభాకర్,మద్దెల పవన్ తదితరులు పాల్గొన్నారు.

# బొప్పారం సీనియర్ కాంగ్రెస్ నేత చంద్రయ్య మృతి - నివాళులర్పించిన దైద రవీందర్





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 21:** బొప్పారం గ్రామ సీనియర్ కాంగ్రెస్ నేత తిరుపతి చంద్రయ్య మృతి చెందారు. ఆయన మృతదేహానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డిసి ఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి, చల్ల జీవన్ రెడ్డి, కుంభం శివయ్య, తిరుపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూలగూడలో ఘనంగా అన్నదానం

**వినాయకుని సన్నిధిలో భక్తిశ్రద్ధలతో అన్నదానం**

**సేవాభావంతో అన్నదానం.. జెట్ట లావణ్య రమేష్**



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 21:** నందిగామ మండలం మోత్కూలగూడ గ్రామపంచాయతీ ఆవరణలోని హనుమాన్ ఆలయం వద్ద వినాయకుని ప్రతిష్ఠ సందర్భంగా శివాజీ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఐకమత్యంతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వినాయకుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అన్నదానం చేయడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమని, భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకోవచ్చన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజలందరినీ కలుపుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు, యువత, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.అన్నదాన కార్యక్రమానికి దాతలుగా గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్, గ్రామ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బీర్ల మహేష్, ఉపాధ్యక్షులు జెట్ట శ్రీను, జెట్ట అంజయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వానరసి నరసింహ, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ నరసింహులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలి

**• పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి...**

**శాసనసభ్యులు డా. భూక్యా మురళి నాయక్**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 21:** నియోజకవర్గం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని శాసనసభ్యులు డా. భూక్యా మురళి నాయక్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ పనులు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనులు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ప్రజల నుంచి వచ్చే విద్యుత్ సంబంధిత ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గణపతి పూజలో మతసామరస్యం.. సయ్యద్ మజీద్‌సబేరా దంపతుల భక్తి

**చిన్నకొండూరులో గణనాథుడికి ప్రత్యేక పూజలు..**

**కులమతాలకు అతీతంగా సోదరభావానికి చాటిన**

**గౌరీపుత్ర యూత్ అసోసియేషన్ వేడుకలు**

**చౌటుప్పల్ మండలం చిన్నకొండూరులో గౌరీపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు**



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 21:** చౌటుప్పల్ మండలం, చిన్నకొండూర్ గ్రామం లో మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని చాటిచెప్పేలా చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా ఓ ముస్లిం యువకుడు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామంలో గౌరీపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఈ దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ముస్లిం యువకుడు వినాయకుడికి పూజలు చేసి, స్వామివారి ఆశీస్సులు కోరుకున్నారు. హిందూముస్లిం సోదరభావానికి, పరస్పర గౌరవానికి ఈ కార్యక్రమం చక్కని నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.పండుగలు ప్రజలను విడదీయడానికి కాదు.. ప్రేమ, సోదరభావం, ఐక్యతను పెంపొందించ డానికి దోహదపడాలని పలువురు అన్నారు. చిన్నకొండూరు గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసిమెలిసి వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.'మతాలు వేరైనా.. మనసులు ఒక్కటే' అనే సందేశాన్ని చాటుతూ గణపతి పూజలో ముస్లిం యువకుడు పాల్గొనడం గ్రామంలో సోదరభావానికి నిదర్శనంగా నిలిచింది.

# ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**తొలి అక్షరం/కొణిజర్ల సెప్టెంబర్ 21:** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కొణిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఊటుకూరి రంజిత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్యకు రంజిత్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కొణిజర్ల మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలతో పాటు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ అంశాలపై చర్చించినట్లు రంజిత్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం కమిషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని రంజిత్ ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత వర్గాల నుంచి వచ్చే సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**- వైద్య చికిత్స కోసం వడ్ల సుదర్శన చారికి రూ. 3 లక్షల ఎల్‌ఓసి అందచేత**



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 21:** ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థిక ఇబ్బందుల వల్ల వైద్యం చేయించుకోలేని కొత్తూరు మండల ఇన్ముల్ నార్వ గ్రామవాసి వడ్ల సుదర్శన చారికి మెరుగైన చికిత్స నిమిత్తం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఆర్థిక సహాయం కోరగా స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ. 3 లక్షల విలువైన ఎల్ఓసి పత్రాన్ని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అజయ్ నాయక్,తాంద్ర విష్ణు వర్ధన్ రెడ్డి,మాజీ ఎంపిటిసి బాల్ రాజ్, నాయకులు ఇంద్ర సేన రెడ్డి, కే.కుమార్, కే.నర్సిమ శివ చారి తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో తొలిసారి గణేశ్ ఉత్సవ చెస్ ఛాంపియన్‌షిప్

**చదరంగ పోటీలకు మల్లికార్జున కాలనీ పతంజలి యోగా మందిర్ హాల్ వేదిక**

**బాలబాలికల మేధాశక్తికి చెస్ ఛాంపియన్‌షిప్-2026**




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 21:** షాద్‌నగర్ పట్టణంలో తొలిసారిగా గణేశ్ ఉత్సవ చెస్ ఛాంపియన్‌షిప్2026 నిర్వహించనున్నారు. షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 27న మల్లికార్జున కాలనీలోని పతంజలి యోగా మందిర్ హాల్‌లో పోటీలు జరగనున్నాయి. ఉదయం 8.30 గంటలకు క్రీడాకారుల రిపోర్టింగ్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. 9 గంటలకు ప్రారంభమయ్యే పోటీలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నాయి. అండర్8 నుంచి అండర్16 వరకు ఐదు విభాగాల్లో బాలబాలికలు పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు మెమెంటోలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి సర్టిఫికెట్, మెడల్ అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. చెస్ ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యం పెంపొందించడమే లక్ష్యంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 26న సాయంత్రం 4 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు వానరసి జగన్ కోరారు. మరిన్ని వివరాల కోసం 93468 43126 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# సంచార జాతి పిల్లలకు ప్రభుత్వ బడి నిర్మించాలి

**హాజీపల్లి శివారులో బడి కోసం పంచాయతీ తీర్మానం**

**ఎమ్మెల్యేకు గ్రామపంచాయతీ తీర్మానం అందజేత**




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 21:** షాద్‌నగర్: ఫరూక్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామ శివారులో నివసిస్తున్న సంచార జాతుల పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని గ్రామపంచాయతీ తీర్మానం చేసింది. ఈ మేరకు సర్పంచ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ తీర్మాన ప్రతిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. గ్రామ శివారులో పాఠశాల లేకపోవడంతో సంచార జాతుల పిల్లలు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. చిన్నారులకు సమీపంలోనే విద్య అందేలా పాఠశాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ బడి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు విష్ణు, సుదర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, రాము, జంగయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో నేటి తరానికి స్ఫూర్తిదాయకం కొండా లక్ష్మణ్ బాపూజీ

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి**

**పద్మశాలి సంఘం, కాంగ్రెస్ పార్టీ మరియు జేఏసీ ఆధ్వర్యంలో నివాళులు**





**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 21:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళు లర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన కీలక పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ సాధన కోసం జీవితాంతం పోరాడిన ఆయన త్యాగం, నిబద్ధత, ప్రజాసేవ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, షాద్ నగర్ తాలూకా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మూలే జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, కన్వీనర్ నక్క బాల్ రాజ్ యాదవ్, హెల్త్ మోటివేటర్ జక్కుల శ్రీనివాస్, ఆర్ఐ వెంకట్ రెడ్డి, వి.రామారావు, మందారం నరసింహులు, ట్రెజరర్ గోర్ల రాము, జంగయ్య, బాలస్వామి, బి.నర్సింలు లతో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, చెంది తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, ముబారక్, దర్శన్, కౌన్సిలర్లు బచ్చలి నరేష్, జమాల్పూర్ చందు,ఖదీర్, హాజిపల్లి సర్పంచ్ కుమార్, వార్డు మెంబర్ విష్ణు, నవీన్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు


# నిజాంపేట్ హౌసింగ్ సొసైటీలో రెస్టోరర్స్ యూత్ ఆధ్వర్యంలో మహా గణపతి లడ్డూ వేలం!

**రూ.97 వేలకు మహా గణపతి లడ్డూను కైవసం చేసుకున్న అక్షయ జ్యువెలర్స్ అధినేత శ్రీశైలం చారి**

**రూ.72 వేలకు మరో లడ్డూను దక్కించుకున్న టింకు రెడ్డి..**

**ఉత్సాహంగా సాగిన వేలంపాట**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 21:** నిజాంపేట్ హౌసింగ్ సొసైటీలో కొలువుదీరిన మహా గణపతి లడ్డూ వేలం భక్తుల సందడి మధ్య ఘనంగా జరిగింది. రెస్టోరర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంపాటలో భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వేలంపాటలో తొలి మహా గణపతి లడ్డూను అక్షయ జ్యువెలర్స్ అధినేత శ్రీశైలం చారి రూ.97 వేల భారీ ధరకు కైవసం చేసుకున్నారు. అనంతరం జరిగిన మరో లడ్డూ వేలంలో టింకు రెడ్డి రూ.72 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో రెండు లడ్డూలకు కలిపి రూ.1.69 లక్షల భారీ ధర పలికింది.ఈ సందర్భంగా లడ్డూలను కైవసం చేసుకున్న శ్రీశైలం చారి, టింకు రెడ్డి మాట్లాడుతూ, మహా గణపతి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తి భావంతో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని తెలిపారు.వేలంపాట సందర్భంగా భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిపై తమ భక్తిని చాటుకున్నారు. రెస్టోరర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహా గణపతి లడ్డూ వేలం కార్యక్రమం నిజాంపేట్ హౌసింగ్ సొసైటీలో పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది.

# ఘనంగా ఫ్రెండ్స్ క్యాంటీన్ ప్రారంభోత్సవం

**ప్రజలకు రుచికరమైన ఆహారం అందించాలి**

**ఫ్రెండ్స్ క్యాంటీన్ ప్రారంభోత్సవంలో షాద్‌నగర్ వార్డు మెంబర్ల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్**

**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 21:** షాద్‌నగర్ నియోజకవర్గలోని అయ్యప్ప టెంపుల్ విద్యుత్ జంక్షన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వార్డు మెంబర్ ఫోరం షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షులు మామిడిపల్లి శ్రీకాంత్ యాదవ్ హాజరై క్యాంటీన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంటీన్ యజమాని మద్దిలేటి సుజాతను శ్రీకాంత్ యాదవ్ తదితరులు సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని, క్యాంటీన్‌లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నూతనంగా ప్రారంభించిన క్యాంటీన్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. వ్యాపారంలో యజమానులు అభివృద్ధి సాధించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుర్రంపల్లి యాదయ్య, అయిత నరేష్, పరమేష్, ధర్మేందర్, జంగా సుధాకర్, జంగా వంశీ, రవి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# తమ్ముడిని కత్తితో పొడిచి హత్య.. 24 గంటల్లోనే నిందితుడు అరెస్ట్

**కక్షతో తమ్ముడిని హతమార్చిన అన్న.. గీసుగొండ పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి సంచలన వివరాలు**

**కత్తి, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం.. నేరాన్ని అంగీకరించిన నిందితుడు ప్రవీణ్**

**వేగంగా కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బందికి అధికారుల అభినందనలు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 21:** గీసుగొండ మండలం గరీబ్‌నగర్‌లో తమ్ముడిని కత్తితో పొడిచి హత్య చేసిన కేసును గీసుగొండ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన మృతుడి అన్న ఎలుబాక ప్రవీణ్ (33)ను పోలీసులు అరెస్ట్ చేసి, అతడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.గరీబ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఈ నెల 19న రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఎలుబాక ప్రసాద్ (31) కత్తిపోట్లకు గురై మృతి చెందాడు. ఛాతి, వీపు, భుజంపై తీవ్ర గాయాలు ఉండటాన్ని గుర్తించిన పోలీసులు.. మృతుడి తల్లి ఎలుబాక సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో మృతుడి అన్న ప్రవీణ్‌పై అనుమానం బలపడింది. తల్లి వద్ద తరచూ డబ్బులు అడిగే ప్రవీణ్‌ను ప్రసాద్ గతంలో పలుమార్లు మందలించడంతో ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తల్లి సంపాదించే డబ్బు తనకే దక్కాలనే ఉద్దేశంతో తమ్ముడిపై కక్ష పెంచుకున్న ప్రవీణ్ హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు.వెల్డర్‌గా పనిచేసే ప్రవీణ్ తాను తయారు చేసుకున్న కత్తిని వెంట తీసుకుని 19వ తేదీ రాత్రి తల్లి, తమ్ముడు ఉంటున్న ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో తల్లి నైట్ డ్యూటీకి వెళ్లడంతో ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. కావాలనే ప్రసాద్‌తో గొడవకు దిగిన ప్రవీణ్.. కత్తితో అతడి వీపు, ఛాతి, భుజంపై పలుమార్లు దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో ప్రసాద్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు.ఇరుగుపొరుగు వారు 108కు సమాచారం అందించగా అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రసాద్ మృతి చెందినట్లు నిర్ధారించారు. తమ్ముడిపై దాడి సమయంలో జరిగిన పెనుగులాటలో ప్రవీణ్ ఎడమ బొటనవేలుకు కూడా గాయమైంది.హత్య అనంతరం తన ఇంటికి వెళ్లిన ప్రవీణ్ భార్యకు విషయం చెప్పి తిరిగి తల్లి వద్దకు వచ్చాడు. తల్లి ప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తుండగా.. "ఏడిస్తే నిన్ను కూడా చంపుతాను.. తమ్ముడిని చంపింది నేనే" అంటూ బెదిరించినట్లు పోలీసులు తెలిపారు.గాయపడిన ప్రవీణ్ 20వ తేదీ తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో గీసుగొండలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించాడు. గాయానికి కారణం అడగగా తమ్ముడిని కత్తితో పొడిచే సమయంలో తన చేతికి గాయమైందని చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవాలని వైద్యుడు సూచించాడు.ఈ క్రమంలో 21వ తేదీన నిందితుడు తన ఇంటి వైపు వస్తున్నట్లు సమాచారం అందడంతో గీసుగొండ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన ప్రవీణ్ ఇచ్చిన సమాచారంతో అతడి ఇంటి సమీపంలోని పొదల్లో దాచిన హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈస్ట్ జోన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్లూస్ టీమ్ సంఘటనా స్థలంలో శాస్త్రీయ ఆధారాలను సేకరించింది. స్వాధీనం చేసుకున్న వస్తువులకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిందితుడు ఎలుబాక ప్రవీణ్ (33)ను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్ఐలు అనిల్‌కుమార్, కుమార్, కానిస్టేబు ళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, భాస్కర్, రజినీకు మార్‌లను పోలీసు అధికారులు అభినందించారు.

# గణపయ్య ఆశీస్సులతో గ్రామాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలి

**• పిట్టలగూడ, రంగాపూర్‌లో ఘనంగా వినాయక ఉత్సవాలు.. పూజల్లో పాల్గొన్న రవీందర్ యాదవ్**




**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్ 21:** నందిగామ మండలం పిట్టలగూడ, రంగాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్వాహకులతో కలిసి భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తాయని అన్నారు. యువత, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని రవీందర్ యాదవ్ ఆకాంక్షించారు. జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు జిల్లెల వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, మండల అధ్యక్షులు మెండే కృష్ణ, నాయకులు కొమ్ము వెంకటయ్య, అంజయ్య, మురళీ, ప్రేమ్ కుమార్ గౌడ్, రవి నాయక్, మల్లేష్, రవి కుమార్, రాఘవేందర్, మహేందర్, శేఖర్, చెన్నయ్య, నరేష్, రమేష్, రాములు, సత్తయ్య, సుధాకర్, గణేష్, నవీన్, అవినాష్, అశోక్, హరీష్, చంద్రయ్య, కృష్ణ యాదవ్, సాయి, దశరథ్, రాములు, నరసింహా, పరుషురామ్ తదితరులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలు

**• డా. నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ పిలుపు**




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్21:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను మట్టి ప్రతిమలతోనే జరుపుకోవాలని పలు అవార్డుల గ్రహీత డా.నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ సూచించారు. పాలమూరులోని బ్రహ్మణవాడి ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు,కార్యవర్గ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి,తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం రాజేంద్రప్రసాద్ భక్తులకు ప్రసాద వితరణ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల్లో జిప్సమ్,గంధకం,మెగ్నీషియం వంటి రసాయనాలు ఉంటాయని,ఇవి నీటిలో కలవడం వల్ల జల వనరులు తీవ్రంగా కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించి, ఇంటి పెరట్లోనే నిమజ్జనం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు.వినాయక మండపాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా భక్తిపాటలు,అష్టోత్తర నామావళితో పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు,భక్తులు పాల్గొన్నారు.



# పోలీసులమంటూ డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు

**- వ్యాపారుల నుంచి రూ.4.20 లక్షల వసూలు**

**- ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్21:** పోలీసులుగా నటిస్తూ బంగారు వ్యాపారులను ఫోన్ల ద్వారా బెదిరించి,డిజిటల్ అరెస్ట్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుల నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన పోలీస్ యూనిఫాంను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డా.శబరీష్ తెలిపారు.కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా నిడమనూరు మండలానికి చెందిన ఇద్దరూ వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు.ఇర్ఫాన్ ఖాకీ దుస్తులు ధరించి దిగిన ఫొటోను వాట్సాప్, ట్రూకాలర్ ఖాతాల్లో డిస్‌ప్లే పిక్చర్ గా పెట్టుకున్నాడు. ఈ నెల 10న గూగుల్ ద్వారా కేసముద్రానికి చెందిన బంగారు వ్యాపారి బోగోజు వేణుగోపాల చారి ఫోన్ నంబర్ సేకరించి,అతనికి కాల్ చేశాడు.తాను వికారాబాద్ సమీపంలోని పార్వతీపురం ఎస్సై గా పరిచయం చేసుకున్నాడు.కొందరు దొంగలను పట్టుకున్నాం వారు దొంగిలించిన బంగారాన్ని నువ్వే కొన్నావు మా వద్ద రసీదులు ఉన్నాయి.రికవరీ కింద డబ్బు పంపకపోతే వచ్చి అరెస్ట్ చేస్తాం అని భయపెట్టాడు.మానసికంగా ఒత్తిడికి గురిచేసి, వాట్సాప్‌లో పంపిన క్యూఆర్ కోడ్ ద్వారా బాధితుడి నుంచి రూ.88,026 వసూలు చేశాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసముద్రం సీఐ వై.సత్యనారాయణ, ఎస్సై కె.క్రాంతి కిరణ్ బృందం సాంకేతిక ఆధారాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు,సైబర్ పోర్టల్ డేటాను విశ్లేషించి నిందితులను గుర్తించారు.ఆదివారం సాయంత్రం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలువురు స్వర్ణకారులే లక్ష్యంగా వీరు ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 మధ్య వ్యవధిలోనే రూ.4 లక్షల 20వేలు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.ఈ నిందితులపై గతంలోనూ నల్గొండ వన్ టౌన్,ఆదిలాబాద్ వన్ టౌన్, ఇచ్చోడ, కట్టంగూర్,తిరుమలగిరి,రామగుండం,బిక్కవోలు స్టేషన్లలో కేసులు ఉన్నాయని ఎస్పీ వెల్లడించారు.జైలు నుంచి బయటకు వచ్చినా తీరు మార్చుకోలేదని పేర్కొన్నారు. **మోసపోవద్దు: జిల్లా ఎస్పీ** పోలీసుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులను నమ్మవద్దని ఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.






# వెంకీ 'ఆదర్శ కుటుంబం'
## నుంచి ఫస్ట్ సింగిల్.. డేట్ ఫిక్స్!



విక్టరీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని మొదటి పాట 'నారాయణమ్మ'ను రేపు(సెప్టెంబర్ 22న) విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలోని 'నారాయణమ్మ' పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. ఇది ఒక మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్‌గా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై వెంకటేశ్ అభిమానుల్లో, సాధారణ ప్రేక్షకుల్లో భారీ ఆశలు నెలకొని ఉన్నాయి.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో ఇద్దరు భామలు నివేదా పేతురాజ్, డింపుల్ హయాతి ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# ప్రారంభమైన 'ది ప్యారడైజ్' జాతర..
## రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్!



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై నెలకొన్న భారీ అంచనాలకు తగ్గట్టే అడ్వాన్స్ బుకింగ్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ గురువారం సినిమా విడుదల కానుండగా, నైజాం ప్రాంతంలో ప్రారంభమైన బుకింగ్స్ పోటెత్తాయి. బుకింగ్స్ మొదలైన కొద్ది సమయంలోనే రూ. 1 కోటికి పైగా గ్రాస్ వసూలైనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.గత రాత్రి డిస్ట్రిక్ట్ యాప్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించగా, ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. లక్షకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. దీంతో పలు షోలు ఇప్పటికే హౌస్‌ఫుల్ బోర్డులతో నిండిపోవడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి అడ్వాన్స్ బుకింగ్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ స్థాయిలో స్పందన రావడం చూసి చిత్రబృందం హర్షం వ్యక్తం చేస్తోంది.బ్లాక్‌బస్టర్ చిత్రం 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచి అంచనాలు ఆకాశాన్నంటాయి. ఈసారి కూడా విభిన్నమైన కథాంశంతో, బలమైన యాక్షన్ ఎలిమెంట్స్‌తో శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నాని గత చిత్రాలకు భిన్నమైన గెటప్‌లో కనిపించనుండటం కూడా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు.
సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్‌లో అభిమానుల కోసం ఓ ప్రత్యేక సర్‌ప్రైజ్ కూడా ప్లాన్ చేసినట్లు చిత్రబృందం ప్రకటించడంతో ఈ కార్యక్రమంపై కూడా ఆసక్తి పెరిగింది. రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# పెరుగుతున్న విడాకుల సంస్కృతిపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు



దేశంలో విడాకులపై చర్చ పెరుగుతున్న వేళ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారుతున్న సంబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్ల దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు.సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి, ఆనందానికి సంబంధించిన ఎన్నో పోస్టులు కనిపిస్తుంటాయి. అయితే అవి ప్రతి ఒక్కరి నిజ జీవితాన్ని ప్రతిబింబించకపోవచ్చు. అందంగా కనిపించే ఫొటోలు, సంతోషకరమైన క్షణాలనే ఎక్కువగా పంచుకోవడంతో.. సంబంధాల్లో సమస్యలు, ఇబ్బందులు బయటకు కనిపించవు. దీంతో ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం మొదలవుతుందని కాజల్ పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియా నిఘా ఎక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి విషయంపైనా వచ్చే కామెంట్లు, విమర్శలు సంబంధాలపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం మహిళలపై మరింత ఎక్కువగా ఉంటుందని గతంలోనూ కాజల్ మాట్లాడారు.ప్రేమ సంబంధాల గురించి కాజల్ గతంలోనూ తన అభిప్రాయాలను వెల్లడించారు. జీవితంలో సంతోషం పూర్తిగా ప్రేమ లేదా వివాహ బంధంపైనే ఆధారపడకూడదని ఆమె చెప్పారు. భర్త గౌతమ్ కిచ్లుతో తన అనుబంధం గురించి కూడా పలు సందర్భాల్లో మాట్లాడారు.ప్రస్తుతం విడాకులపై ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. మారుతున్న అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ నేటి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని కాజల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.


# శర్వానంద్ కోసం శ్రీను వైట్ల కొత్త ఫార్ములా?

టాలీవుడ్‌లో తనదైన కామెడీ మార్క్‌ను క్రియేట్ చేసుకున్న డైరెక్టర్ శ్రీను వైట్ల కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శర్వానంద్‌తో చేస్తున్న జార్జ్ క్రిష్‌పై ప్రత్యేకమైన అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈసారి శ్రీను వైట్ల తన రెగ్యులర్ ఫార్ములాకే మరో కొత్త టచ్ ఇచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో డిస్కషన్ జరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా యాక్షన్, కామెడీ, హీరోయిజం చుట్టూ తన కథలను నడిపించిన ఆయన.. ఈసారి హీరో క్యారెక్టరైజేషన్‌కు సైంటిఫిక్ బ్యాక్‌డ్రాప్‌ను జోడించినట్లు తెలుస్తోంది.
జార్జ్ క్రిష్‌లో శర్వానంద్ జూనియర్ సైంటిస్ట్‌గా కనిపించబోతున్నాడట. ఈ క్యారెక్టర్ ను కేవలం హీరో చేసే జాబ్ లాగా కాకుండా, కథలోని కీలకమైన అంశంగా డిజైన్ చేసినట్లు సమాచారం. మామూలుగా కమర్షియల్ సినిమాల్లో హీరోలను పోలీస్, గ్యాంగ్‌స్టర్, బిజినెస్‌మ్యాన్, మాస్ లీడర్ వంటి పాత్రల్లో చూడటానికి అలవాటు పడిన ఆడియన్స్ కు జూనియర్ సైంటిస్ట్ క్యారెక్టర్ కొత్త అనుభూతినిచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సైంటిఫిక్ నేపథ్యాన్ని శ్రీను వైట్ల తనదైన ఎంటర్టైనింగ్ ట్రీట్‌మెంట్‌తో మిక్స్ చేస్తే ఎలాంటి సిట్యువేషనల్ కామెడీ పుడుతుందనేది ఆసక్తికరంగా మారిందిఅంతేకాదు.. ఈ సినిమా కోసం శర్వానంద్ సరికొత్త మేకోవర్‌లో కనిపించబోతున్నాడని ఇప్పటికే పలు వార్తలొచ్చాయి. సాధారణంగా మేకోవర్ అనగానే హీరో లుక్ మార్పుగా మాత్రమే చూస్తాం. కానీ జార్జ్ క్రిష్‌లో శర్వానంద్ లుక్ కూడా ఆయన పోషిస్తున్న జూనియర్ సైంటిస్ట్ పాత్ర స్వభావానికి తగ్గట్టుగానే ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. అంటే ఈ సినిమాలో హీరో ఇమేజ్ కంటే క్యారెక్టరైజేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇక శ్రీను వైట్ల గత సినిమాల్లో కనిపించిన కామెడీ ఎపిసోడ్స్, హీరో క్యారెక్టరైజేషన్, ఎంటర్టైనింగ్ ట్రాక్‌లకు ఈసారి సైంటిఫిక్ సెటప్‌ను జోడించడం ఆసక్తిని పెంచుతోంది. తన ఫార్ములాను పూర్తిగా మార్చకుండా.. అదే ఫార్ములాకు కొత్త ప్రపంచాన్ని సృష్టించారా అనే డిస్కషన్ కూడా మొదలైంది. శర్వానంద్ కోసం శ్రీను వైట్ల ఇలా ఒక కొత్త ఫార్ములాను సిద్ధం చేశారా అనేది సినిమా రిలీజయ్యే వరకు ఆసక్తికరంగా మారనుంది. ప్రస్తుతం ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఈ షెడ్యూల్‌లో శర్వానంద్, భాగ్యశ్రీ బోర్సేపై కీలకమైన లవ్ సీన్స్‌ను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రయత్నిస్తున్నారు.



# బాలీవుడ్ నటుడికి అంతర్జాతీయ గుర్తింపు..
## అనుపమ్ ఖేర్‌ను సత్కరించిన అమెరికా

ప్రముఖ బాలీవుడ్ నటుడు, విలక్షణ కళాకారుడు అనుపమ్ ఖేర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో ఆయన చేసిన సేవలను, ఆయన రంగస్థల ప్రదర్శనలను గుర్తిస్తూ అమెరికాలోని ఒహాయో రాష్ట్రం ఆయనను ప్రత్యేక ప్రకటనతో సత్కరించింది. కొలంబస్‌లో ప్రదర్శించిన 'జానే పెహచానే అంజానే' అనే నాటక ప్రదర్శనను కూడా ఈ సందర్భంగా ప్రశంసించారు.
ఈ సంతోషకరమైన విషయాన్ని అనుపమ్ ఖేర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఒహాయో రాష్ట్రం నుంచి అందుకున్న గౌరవ పత్రాన్ని చేతిలో పట్టుకున్న ఫొటోను షేర్ చేస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ఈ ప్రత్యేక గౌరవాన్ని ఎంతో వినమ్రతతో, గర్వంతో స్వీకరిస్తున్నాను. నాలుగు దశాబ్దాల నా సినీ ప్రయాణాన్ని, మా 'జానే పెహచానే అంజానే' నాటకాన్ని గుర్తించినందుకు ఒహాయో గవర్నర్ మైక్




డీవైన్, లెఫ్టినెంట్ గవర్నర్ జిమ్ ట్రెస్సెల్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ఈ గౌరవం కేవలం తనకు మాత్రమే కాదని, తనకు గుర్తింపునిచ్చిన భారత సినీ పరిశ్రమకు, తన నాటక బృందానికి కూడా చెందుతుందని అనుపమ్ ఖేర్ తెలిపారు. "స్వదేశానికి ఇంత దూరంలో ఇలాంటి గుర్తింపు లభించడం మనసును కదిలించింది. ఈ మరువలేని గౌరవానికి ఒహాయోకు ధన్యవాదాలు. జై హింద్" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.
1984లో మహేశ్ భట్ దర్శకత్వంలో వచ్చిన 'సారాంశ్' చిత్రంతో అనుపమ్ ఖేర్ తన నట ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 'కర్మ', 'తేజాబ్', 'రామ్ లఖన్', 'దిల్', 'హమ్ ఆప్కే హై కౌన్', 'దిల్వాలే దుల్హనియా లేజాయేంగే', 'కుచ్ కుచ్ హోతా హై', 'స్పెషల్ 26', 'ఊంచాయ్' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలలో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు.
ఆయన చివరిగా 'తన్వి ది గ్రేట్' అనే చిత్రంలో కనిపించారు. ఆటిజంతో బాధపడుతున్న ఒక యువతి తన తండ్రి కలను నెరవేర్చడానికి సైన్యంలో చేరాలనుకునే స్ఫూర్తిదాయక కథతో ఈ సినిమా తెరకెక్కింది.